

తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత



తన తండ్రి కేసీఆర్ చేతిని మురిపెంగా ముద్దాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఆమె భర్త అనిల్, ఎమ్మెల్యేలు వేముల, కౌశిక్, మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

# కేసీఆర్ మదిలో ఆనందం

## కూతురు కవితకు బీఆర్ఎస్ అధినేత ఆశీర్వాదం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): అనేక రోజుల తర్వాత తన కూతురును చూడగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కండ్లలో ఆనందభాష్పాలు.. కూతురిని ఆత్మీయంగా అలుముకుని నిండునూరేండ్లు వర్ధిల్లు అని దీవించారు. 'కవితక్క వచ్చింది.. సార్ మనసు తేలికైంది..' ఏ నోట విన్నా ఇదే ముచ్చట. ఐదున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కేసీఆర్‌ను గురువారం ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. భర్త అనిల్‌రావు, కుమారుడు ఆదిత్యతో కవిత వ్యవసాయ క్షేత్రానికి చేరుకోగానే దిష్టితీసి ఇంట్లోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, కల్వకుంట్ల వంశీధర్‌రావు, పార్టీ సీనియర్ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సహా పలువురు ఆమెకు స్వాగతం పలికారు.

### ఉద్వేగానికి లోనైన కేసీఆర్

కన్నబిడ్డను చూడగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను తొలిసారి చూడగానే ఆయన కండ్లలో ఆనందం తొణికిసలాడింది. ఎమ్మెల్సీ కవిత తండ్రి కేసీఆర్ దగ్గరికి చేరి ఆయన పాదాలకు నమస్కరించారు. బిడ్డను కేసీఆర్ ఆప్యాయంగా అక్కున చేర్చుకొని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కవిత మురిపెంగా తన తండ్రి చేతిని ముద్దాడారు. ఆమె యోగక్షేమాలపై కేసీఆర్ ఆరాతీశారు. మధ్యాహ్న భోజనం తర్వాత సాయంత్రం 4.30 గంటలకు కవిత తిరిగి హైదరాబాద్ నగరంలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లారు. చాలా కాలం తర్వాత తమ పార్టీ అధినేత ఉత్సాహంగా కనిపించారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత వెంట మాజీమంత్రి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.




చూస్తుండగానే ఎంత బాగా కూల్చిపారేస్తున్నారు.. మీ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేసినంత ఈజీగా కూల్చేస్తున్నారు గదా సార్?!

# సుప్రీంనే తప్పుపడ్తరా?

మొదటిపేజీ తరువాయి...

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

### సీఎం బాధ్యతగా ఉండాలి కదా..

సీఎం రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇది చాలా పాత కేసు అని, ఇప్పటివరకు 25 మంది సాక్షులను విచారించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'ఆయన (సీఎం రేవంత్‌రెడ్డి) నిన్న ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఈ రోజు పొద్దున పత్రికల్లో చదివాం. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి అలాంటి వ్యాఖ్యలు చేయవచ్చా?' అని ప్రశ్నించారు. 'ఆయన ఏం అన్నారో ఓసారి చూడండి. మేము రాజకీయ పార్టీలను సంప్రదించి ఆదేశాలు ఇస్తామా?. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయవచ్చా?' అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కొందరి మనసుల్లో భయాందోళనలు కలిగించే అవకాశం ఉన్నదని అన్నారు. 'మేం రాజకీయ నాయకులను పట్టించుకోం. మా ఆదేశాలను ఎవరైనా విమర్శించినా ఇబ్బంది లేదు. మా మనస్సాక్షి ప్రకారం, మేము చేసిన ప్రమాణం ప్రకారం మా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాం' అని స్పష్టం చేశారు. జస్టిస్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. 'ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలేనా ఇవి?. ప్రభుత్వం, న్యాయస్థానాల మధ్య పరస్పర గౌరవం ఉండాలన్న ప్రాథమిక నియమం కూడా తెలియదా?. వ్యవస్థల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నా.. గౌరవం ఉండాలి కదా' అని ప్రశ్నించారు. 'ఇలాంటి ప్రవర్తన, ఇంత మొండి వైఖరి ఉంటే ఎలా?. కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల్లో మేము (కోర్టులు) జోక్యం చేసుకోబోమని ఎప్పుడూ చెప్తుంటాం. అంతే గౌరవాన్ని మేము వారి నుంచి కూడా ఆశిస్తాం' అని జస్టిస్ గవాయి పేర్కొన్నారు. ఈ ఒక్క కారణంతో కేసు విచారణను పిటిషనర్ కోరినట్టు మధ్యప్రదేశ్ హైకోర్టు బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వొచ్చు అన్నారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలపై ధైర్యంగా వ్యాఖ్యలు చేయచ్చని అనుకుంటున్నారా. నిన్ననే ఒక అదనపు కార్యదర్శికి నోటీసులు ఇచ్చాం' అని మహారాష్ట్రకు చెందిన ఐఏఎస్ అధికారికి కోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం పట్ల ఆయనకు గౌరవం లేకపోతే.. వేరే రాష్ట్రంలో కేసు విచారణను ఎదుర్కోమనండి.. అని జస్టిస్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దశలో రేవంత్‌రెడ్డి తరఫున న్యాయవాదులు స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు అవాంఛనీయమని, ఆయన తరఫున సుప్రీంకోర్టును క్షమాపణలు కోరారు. మరోసారి ఇలా జరుగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు. సీఎం వ్యాఖ్యలపై ఎలాంటి నోటీసులు ఇవ్వవద్దని విజ్ఞప్తిచేశారు. వారి విజ్ఞప్తి మేరకు కేసు విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది.



> 'మేం రాజకీయ పార్టీలను సంప్రదించి ఆదేశాలు ఇస్తామా? బాధ్యతగల ముఖ్యమంత్రి చేయదగిన ప్రకటనేనా ఇది? ఆయన మాటలు ప్రజల మనస్సుల్లో భయాందోళనలు రేకెత్తించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా? మీ రాజకీయ శత్రుత్వంలోకి కోర్టులను ఎందుకు లాగుతారు? ప్రభుత్వం, న్యాయస్థానాల మధ్య పరస్పర గౌరవం ఉండాలన్న ప్రాథమిక నియమం కూడా తెలియదా? ఇంత మొండి వైఖరి ఉంటే ఎలా? దేశంలోనే అత్యున్నత న్యాయస్థానమంటే గౌరవం లేదా?. ఇది న్యాయస్థానాల గౌరవ ప్రతిష్టలకు సంబంధించిన అంశం'.
>
> **- సుప్రీంకోర్టు ధర్మాసనం**

### నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదు..

**జగదీశ్‌రెడ్డి** తరఫున సీనియర్ న్యాయవాదులు అర్యమ సుందరం, దామ శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. ఓటుకు నోటు కేసులో నిందితుడు రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి అని, హోం శాఖ సైతం ఆయన ఆధ్వర్యంలోనే ఉన్నదని చెప్పారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అవినీతి నిరోధక శాఖ నేరుగా ఆయనకే రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యులను, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లను ఇప్పటివరకు ఎగ్జామిన్ చేయలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం తన వైఖరిని క్రమంగా మార్చుకుంటున్నట్టు కనిపిస్తున్నదని, రేవంత్ రెడ్డి ప్రత్యక్ష సాక్షులను ప్రభావితం చేస్తున్నట్టు అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదని, కాబట్టి విచారణను మధ్యప్రదేశ్ హైకోర్టుకు మార్చాలని కోరారు. లేదా పోలీసులు సీఎంకు రిపోర్ట్ చేయకుండా కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిగినా అభ్యంతరం లేదని చెప్పారు.

## బోధనా ఫీజుల బకాయిలు 5900 కోట్లు ఎప్పుడిస్తరు?

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి
- పిల్లలు చదువుకు దూరమైతే సర్కారుదే బాధ్యత : కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కా లర్‌షిప్‌ల జాడేదని ప్రశ్నించారు. బోధనా ఫీజుల బకాయిలు రూ.5,900 కోట్లకు చేరుకున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నదని, ఆ బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారని నిలదీశారు. ఈ ఏడాది స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులకు కూడా దిక్కులేని పరిస్థితి తెచ్చారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరి కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇం దుకు సర్కారే బాధ్యత వహించాలని చెప్పారు. పేద విద్యార్థులంటే ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు రాక ఎంతోమంది పేద విద్యార్థులు చదువు వదిలేసి కూలి పనికి వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వసతి గృహాల్లో మెయింటెనెన్స్ చార్జీలు కూడా రాకపోవటంతో విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

### తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నరు

స్కాలర్‌షిప్‌లు పెండింగ్ పెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఫీజులు అందక యాజమాన్యాలు కూడా విద్యార్థులకు చదువు చెప్పలేని పరిస్థితి వచ్చిందని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, నిర్లిప్తత కారణంగా పేద విద్యార్థుల తల్లితండ్రులు అప్పులు తెచ్చి పిల్లలను చదవిస్తున్నారని ఉదహరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం మానేయాలని సూచించారు. వెంటనే బోధనా రుసుము బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అమెరికాకు కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికాకు వెళ్లారు. బుధవారం రాత్రి పయనమైన ఆయన.. ఎక్స్ వేదికగా 'తండ్రి బాధ్యతలు నిర్వర్తించడానికి' అని పోస్ట్ చేశారు. కుమారుడు హిమాన్షు అమెరికాలో ఉన్నత విద్య అడ్మిషన్ కోసం కేటీఆర్ అమెరికాకు వెళ్లినట్టు సమాచారం.

## పాస్‌పోర్టు సేవల్లో సాంకేతిక సమస్యలు

**2నుంచి యథావిధిగా పునరుద్ధరణ**

**హైదరాబాద్ ఆర్పీవో స్నేహజ**



హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ) : సాంకేతిక సమస్యల కారణంగా పాస్‌పోర్టు సేవల్లో అంతరాయం కలిగిందని, సెప్టెంబర్ 2న ఉదయం 6 గంటల నుంచి యథావిధిగా సేవలు అందుబాటులోకి వస్తాయని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు అధికారి స్నేహజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నమోదైన స్లాట్స్‌ను మరో తేదీకి మారుస్తామని, అందుకు సంబంధించిన సందేశాలు దరఖాస్తుదారులకు చేరవేసినట్టు పేర్కొన్నారు. స్లాట్స్‌కు సంబంధించి సందేహాలుంటే rpo.hyderabad@mea.gov.inకు మెయిల్ చేయవచ్చని సూచించారు.



యాదాద్రి జిల్లా కొలనుపాక సోమేశ్వరాలయాన్ని దర్శించుకుంటున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

# టూరిజం క్షేత్రంగా ఓబుల కేశ్వాపూర్ ఆలయం

- తెలంగాణలో సందర్శించిన తొలి గ్రామ ప్రత్యేకతకు కృషి
- జనగామ జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడి

జనగామ/యాదాద్రి భువనగిరి, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సందర్శించిన తొలి గ్రామమైన జనగామ జిల్లా ఓబుల్ కేశ్వాపూర్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని టూరిజం దైవక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజుల పర్యటనకు వచ్చిన ఆయన.. గురువారం జనగామ జిల్లా పర్యటనను ముగించుకొని యాదాద్రి భువనగిరి జిల్లాకు రోడ్డు మార్గంలో వెళ్లారు. తొలుత ఉదయం వరంగల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా జనగామ సమీకృత కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధికారులు, ప్రముఖ కవులు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో ముఖాముఖి నిర్వహించారు. తర్వాత గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం స్వగ్రామం జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్‌ను సందర్శించిన గవర్నర్‌కు కళాకారులు బోనాలు, కోలాటాలతో స్వాగతం పలికారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు స్వామికి అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో గవర్నర్ పూల మొక్కను నాటారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చిన గవర్నర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే జండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. ముందుగా ఆలేరు మండలంలోని కొలనుపాక జైన మందిరం, సోమేశ్వరాలయాన్ని గవర్నర్ సందర్శించారు. అనంతరం భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత భువనగిరి కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, వివిధ రంగాల అవార్డు గ్రహీతలతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

# బేతవోలుకు 'భాషా సమ్మాన్' ప్రదానం

**ఢిల్లీలో అందజేసిన కేంద్రసాహిత్య అకాడమీ**

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ అవార్డు అందుకున్నారు. ఢిల్లీలోని రవీంద్రభవన్‌లో గురువారం సాహిత్య అకాడమీ ప్రెసిడెంట్ మాధవ్ కౌశిక్ భాషా సమ్మాన్ పురస్కారాన్ని రామబ్రహ్మానికి ప్రదానం చేశారు. భాషా సమ్మాన్ నగదు బహుమతిగా రూ. లక్ష నగదు, తామ్రపత్రం, ప్రశంసాపత్రం అందజేశారు. ప్రాచీన, మధ్యయుగపు సాహిత్యంపై రామబ్రహ్మం వెలువరించిన రచనలకు.. 2021 సంవత్సరానికి ఈ అవార్డు దక్కింది. సాహితీ సేవకు గుర్తింపుగా దక్షిణ భారతదేశం నుంచి ఈ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. కాగా ఆచార్య రామబ్రహ్మం కవిగా, రచయితగా, అనువాదకుడిగా, పండితుడిగా, వ్యాఖ్యాతగా, అష్టావధానిగా సుప్రసిద్ధులు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో జన్మించారు. కథలు, కవిత్వం, నాటకాలు కలిపి 34కు పైగా గ్రంథాలు రచించారు. సాహితీ వ్యాసాలను వెలువరించారు.



ఢిల్లీలో సాహిత్య అకాడమీ ప్రెసిడెంట్ కౌశిక్ నుంచి అవార్డు అందుకుంటున్న రామబ్రహ్మం



హత్నూరలో చెక్కుల పంపిణీని అడ్డుకుంటున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

# చెక్కుల పంపిణీని అడ్డుకున్న కాంగ్రెస్

- నర్సాపూర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఘటన
- ప్రొటోకాల్ పాటించడంలో ముందుంటా: సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, ఆగస్టు 29: సంగారెడ్డి జిల్లా హత్నూర రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. తొలుత లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకోబోయారు. బీఆర్ఎస్ నాయకులు స్టేజీపైకి ఎలా వెళ్తారని కాంగ్రెస్, స్థానిక ఎంపీ రఘునందన్‌రావుకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని బీజేపీ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓ క్రమంలో ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ నిలిపివేయాలని సభలో నినాదాలు చేశారు. ప్రజా సంక్షేమానికి కృషిచేయాలి తప్ప కార్యక్రమాన్ని అడ్డుకోవద్దని ఎమ్మెల్యే సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రాక ఏడాది గడుస్తున్నదని, వచ్చిన చెక్కులను పంపిణీ చేయొద్దనడం సమంజసం కాదని, ప్రొటోకాల్ పాటించడంలో నేను ఎప్పుడూ ముందుంటా' అని తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న నాయకులకు నచ్చజెప్పడంతో చెక్కుల పంపిణీ సాఫీగా సాగింది.

# రేవంత్‌రెడ్డీ.. ఇకనైనా తీరుమార్చుకో..

**సుప్రీం కోర్టు వ్యాఖ్యలతో అయినా కండ్లు తెరువు**

**నువ్వు ఏసీబీకి పట్టుపడితే బెయిల్ రాలేదా?**

**అందుకు బీజేపీ సహకారం ఉన్నదనుకోవాలా?**

**బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): సుప్రీం కోర్టు వ్యాఖ్యలతోనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుద్ధి తెచ్చుకొని తీరు మార్చుకోవాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో హితవుపలికారు. న్యాయస్థానాలు రాజ్యాంగ పరిరక్షణ వ్యవస్థలనే కనీస ఇంగితం మరిచి సీఎం వ్యవహరించటం బాధాకరమని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరించేలా వ్యాఖ్యానించటం సరికాదనే అవగాహన రేవంత్‌రెడ్డికి లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు వేసిన అక్షింతలతో అయినా బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు. ఈడీ, సీబీఐ ఇప్పటి వరకు ఎమ్మెల్సీ కవిత నేరం చేసినట్టు రుజువులు చూపలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. రూ.50 లక్షలతో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడిన కేసులో రేవంత్‌రెడ్డికి బెయిల్ వచ్చిన విషయాన్ని మర్చిపోవద్దని పేర్కొన్నారు. నాడు రేవంత్‌రెడ్డికి బెయిల్ రావడం వెనుక బీజేపీ సహకారం ఉందని అనుకోవాలా? అని ప్రశ్నించారు.

# 42% బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే యుద్ధమే

**బీసీ ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించాలి**

**రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య**

**పోరాటాల ద్వారానే హక్కుల సాధన: సిరికొండ**



ఖైరతాబాద్, ఆగస్టు 29: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకపోతే రాష్ట్ర ప్రభుత్వంతో యుద్ధమే జరుగుతుందని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ సెంట్రల్ కోర్ట్‌లో గురువారం జరిగిన బీసీ కులసంఘాల అఖిలపక్ష సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు లోక్‌సభలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాహుల్‌గాంధీ బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, కులగణన చేపడుతామని ప్రకటనలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. కులగణన చేపట్టకుండా స్థానిక ఎన్నికలను నిర్వహిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బీసీలు పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ లాల్ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నాయకుడు ఎల్ రమణ, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**పురుగుల మందు తాగి బలవన్మరణం**

**మహబూబాబాద్ జిల్లాలో విషాదం**



మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 29: అప్పుల బాధలు తాళలేక ఓ రైతు తనువు చాలించాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపం చెంది పురుగుల మందు తాగి బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ విషాద ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండల శివారులో చోటుచేసుకుంది. మండల పరిధిలోని నడివాడకు చెందిన పెద్దల పాపయ్య (51)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నిరుడు మిర్చి సాగు చేశాడు. పంటకు ముడత, బంక రోగం వచ్చి పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ఈ సంవత్సరం తన పొలంతో పాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని సొంతంగా మిర్చి నారు పోసి తోట వేశాడు. అందులో కొంత మిర్చి నారు చనిపోయింది. నర్సరీ నుంచి నారు తెచ్చి మళ్లీ వేసినా బతకలేదు. ఇలా రెండేండ్లుగా పంట పెట్టుబడి ఖర్చులకు రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటల దిగుబడి రాకపోవడంతో వాటిని ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. గురువారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స కోసం స్థానికులు ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.